# జన్మభూమి - స్వామి భక్తి

శ్రీ డేగా రాధాకృష్ణయ్య

అది గోదావరీ నదీతీరముననొక చిట్టడవి. అందులో ననేకరకముల ఫలవృక్షములు, వాని నాశ్రయించుకొని పక్షులనేకముండేవి. ఒక గుబురుగానున్న అశ్వత్థవృక్షముమీద గూడు నిర్మించుకొని లకుముఖి, శుచిముఖి అనే రెండు పక్షులు నివసిస్తుండేవి.

ఆ వృక్షము మార్గమధ్యముననుండుట చేత వచ్చేపోయే వారు మార్గాయాసపు బడలిక తీర్చుకోడానికి దాని నీడన విశ్రమించేవారు.

ఒకనాడు ఒక యజమాని, నౌఖరు ఆ చెట్టునీడన విశ్రాంతి తీసికుంటున్నారు. యజమాని నౌఖరు నొకకథ చెప్పమని అడిగాడు.

"మానవ జీవితమే ఒకకథ. నా స్వంత జీవితమునే కథగా చెప్తాను వినండి" అని ప్రారంభించాడు.

"నేను ఒకప్పుడు జమీందారు దగ్గర నౌకరిలో ప్రవేశించిన కొద్దికాలంలోనేఅతని జమీన్ పరుల హస్తగతమయిపోయింది. నేను అచ్చట మానేసి నొకమంత్రి పుంగవుని నౌకరికి ఆశ్రయించాను. అచ్చట సయితం నేను పోయి చేరిన కొన్ని రోజులకే మంత్రి పదభ్రష్టుడైపోయాడు. తర్వాత అక్కడ మానేసి నొకషావుకారు యొద్ద నౌకరికి కుదిరిన బహుస్వల్పకాలంలోనే సరకులధరలు తారుమారై దివాలా తీశాడు. తర్వాత అక్కడినుండి వచ్చి మిమ్ముల నాశ్రయించాను." అని కథ ముగించాడు.

దానిని వినిన యజమాని "అయితే నీవి అంత చలవపాదాలన్నమాట! "అన్నాడు.

దీనిని వింటున్న లకుముఖి, శుచిముఖి పక్షులజంట వీరికి గుణపాఠం ఎలాగ నేర్పడమా అని ఆలోచింపసాగాయి.

ఇంతలో నాయడవిలో నొకమూలనుండి కారు చిచ్చు వ్యాపించ మొదలుపెట్టింది. ఆ భయంకర దృశ్యాన్ని చూచి ఆ చెట్టు నీడనున్న వారనేకులు పలాయన మంత్రము పఠించారు. యజమాని, నౌఖరు తలపై కెత్తి చూచి చలించకుండా యున్న పక్షుల జంటను చూచి కారు చిచ్చుకాహుతి యగునను ఆదుర్దాతో తరిమి వెయ్యాలని కేకలు వేయడం మొదలు పెట్టారు. ఆ జంట పక్షులు మాత్రం కదలలేదు.

"అగ్నిజ్వాలలు భయంకరంగా ఆవరిస్తున్నా యీ పక్షులు భయపడకుండా

అలాగే యున్నవేమా'' అని ఆశ్చర్య చకితులయ్యారు.

అప్పుడా జంట పక్షులలో నొకటి మనుష్యభాషలో ''మీరు మూర్ఖులు, విశ్వాసముమాలినవారు కాబట్టి కష్టానికి వెరచి సుఖానికి ప్రాకులాడుతూ, మాకు నీడనిచ్చి, కాయగసురులను, ఫలములనిచ్చి పోషిస్తున్న యీ వృక్షాలు ఆపదలో నుండగా యీ యడవినివదలి పొమ్మనంటున్నారు. మేమంత విశ్వాసఘాతకులము కాము. కష్టమో సుఖమో యీ ప్రాంతము మా జన్మభూమి కాబట్టి యితరులతో పాటుయుండి అనుభవిస్తాము. ఈ వృక్షము మాకు తల్లివంటిది. జన్మభూమి స్వర్గధామ మని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి - మీకు తెలియదా!'' అన్నది.

ఆ మాటలు ఆశ్చర్యము కలిగించింది. అతివడిగా ఆకాశాన్నంతా కారుమేఘము లాక్రమించి కుంభవృష్టి కురిసింది. అగ్ని చల్లారింది. మాతృభూమిని గౌరవించడం, స్వామిభక్తి పరాయణులుగ నుండటం ప్రతిమానవునియొక్క ధర్మం కదాయనుకుంటూ యజమాని, సౌఖరు యిండ్లకు చేరారు.



ఎ. వి. యం. వారి 'సంఘంలో' అంజలీదేవి.

